
# ఆంధ్ర వైభవము

- సుశ్రీ.

*ఆంధ్రప్రదేశ్ అవతరణ (నవంబరు 1) సందర్భముగా ఈ వ్యాసమును ప్రచురిస్తున్నాము. ఈ వ్యాసం ముఖ్యోద్దేశ్యము మన చరిత్రని క్లుప్తంగా గుర్తుచేసుకోవడమే. చాలా సంఘటనలు ఇందులో ప్రస్తావింపబడలేదు. అన్ని సంఘటనలను ప్రస్తావించడం కూడా కష్టం. పాఠకులు గ్రహించగలరు.* ॥ సం ॥




ఆంధ్రదేశానికి భౌగోళిక ఎల్లలు తూర్పున బంగాళాఖాతము, పశ్చిమాన కర్ణా టక, మహా రాష్ట్ర, ఉత్తరాన ఒరిస్సా, మధ్యప్రదేశ్, మహా రాష్ట్ర, దక్షిణమున తమిళనాడు, కర్ణాటకలు ఉన్నాయి. కాని సంగీత, సాహిత్య, నృత్య కళారంగాలలో ఎల్లలు తెలపడం అసాధ్యం. చేతికి ఎముకలేని ఎందరో దాతలు, వెన్ను చూపని యోధులు, శిలకు ప్రాణం పోసే శిల్పులు, పటానికి జీవం పోసే చిత్రకారులకు నిలయం ఈ భూమి. క్రీడా రంగం, విద్యా రంగం, సాంకేతిక రంగం, ఇది - అది అని లేక అన్నింటా ముందుకు, మున్ముందుకు పోతూ నేటి యువ'తరంగం' శబ్దవేగాన్ని అధిగమిస్తోంది. పాడి పంటలతో, జీవనదులతో, పర్వతశ్రేణులతో, దివ్య క్షేత్రాలతో, పుణ్యతీర్థాలతో అలరారుతున్న పుణ్యభూమి, అన్నపూర్ణ ఈ త్రిలింగదేశము. దీని విశేషాలను ఎంత చెప్పినా అవి సశేషాలే.

ఆంధ్రదేశానికి భౌగోళిక ఎల్లలు తూర్పున బంగాళాఖాతము, పశ్చిమాన కర్ణా టక, మహారాష్ట్ర, ఉత్తరాన ఒరిస్సా, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, దక్షిణమున తమిళనాడు, కర్ణాటకలు ఉన్నాయి. కాని సంగీత, సాహిత్య, నృత్య కళారంగాలలో ఎల్లలు తెలపడం అసాధ్యం. చేతికి ఎముకలేని ఎందరో దాతలు, వెన్ను చూపని యోధులు, శిలకు ప్రాణం పోసే శిల్పులు, పటానికి జీవం పోసే చిత్రకారులకు నిలయం ఈ భూమి. క్రీడా రంగం, విద్యా రంగం, సాంకేతిక రంగం, ఇది - అది అని లేక అన్నింటా ముందుకు, మున్ముందుకు పోతూ నేటి యువ'తరంగం' శబ్దవేగాన్ని అధిగమిస్తోంది. పాడి పంటలతో, జీవనదులతో, పర్వతశ్రేణులతో, దివ్య క్షేత్రాలతో, పుణ్యతీర్థాలతో అలరారుతున్న పుణ్యభూమి, అన్నపూర్ణ ఈ త్రిలింగదేశము. దీని విశేషాలను ఎంత చెప్పినా అవి సశేషాలే.

ఆంధ్ర విష్ణువును మొట్టమొదటి తెలుగు రాజుగా పలువురు విశ్వసిస్తారు. ఆయన శ్రీశైలం,కాళేశ్వరం, భీమేశ్వరాల మధ్య తన రాజ్యాన్ని ఏర్పరచుకున్న కారణాన దీనికి త్రిలింగ దేశమని పేరు వచ్చింది. ఆ దేశ ప్రజలకు తెలుగు వారని పేరు వచ్చింది. తరువాత శాతవాహనుల కాలము ప్రారంభమైనది. వీరిలో హాలుడు 'గాథా సప్తసతి' ని ప్రాకృత భాషలో రచించాడు. ఈయన మంత్రి గుణాఢ్యుడు 'బృహత్కథ'ను రచించాడు. తరువాత గౌతమీపుత్ర శాతకర్ణి కాలంలో బౌద్ధమత వ్యాప్తి జరిగింది. ధాన్యకటకం, భట్టిప్రోలు, అమరావతి మొదలైన చోట్ల బౌద్ధ స్తూపాలు వెలిశాయి. వీరి అనంతరము ఇక్ష్వాకుల కాలంలో వాస్తు కళ, గృహ నిర్మాణాలు జరిగాయి. నేడు నాగార్జున కొండగా పిలువబడే నాటి 'శ్రీ' పర్వతము ప్రసిద్ధ బౌద్ధ సంఘారామము. ఆనాటి నాగార్జునుడు ప్రపంచ ప్రఖ్యాతి గాంచాడు.

తదనంతరం కాంచీపురము రాజధానిగా పల్లవులు పాలించారు. మహాబలిపురం శిల్పాలు వీరి ప్రతిభకు తార్కాణం. ఆ సమయంలోని కళింగులు శ్రీకూర్మము, పూరీ జగన్నాధాలయం, కోణార్క్ ఆలయాలను నిర్మించారు. వారి తరువాత చాళుక్యులు, చోళ చక్రవర్తులు సామ్రాజ్య స్థిరత్వం కోసం వియ్యాలు అందారు. రాజరాజచోళుని కుమారుడే రాజరాజనరేంద్రుడు. రాజమహేంద్రవరము (నేటి రాజమండ్రి) ఈయన రాజధాని. ఈయన ప్రోత్సాహముతోనే ఈయన ఆస్థానకవి నన్నయ్య భట్టు పంచమ వేదమైన శ్రీమదాంధ్ర మహాభారతమును ఆది, సభా పర్వములు పూర్తిగను, అరణ్యపర్వము



వేయి స్థంబాల గుడి

కొంత తెనిగించి రాజరాజనరేంద్రునికే అంకితమిచ్చాడు. నన్నయ్యకు ఆదికవి, వాగనుశాసనుడు, శబ్దశాసనుడు అనే బిరుదులున్నాయి. వీరి అనంతరము కాకతీయుల ప్రాభవము వెల్లివిరిసింది. వీరిలో గణపతిదేవ చక్రవర్తి రాజధానిని హనుమకొండ నుండి ఓరుగల్లు (నేటి వరంగల్)కు మార్చి అచట శత్రు దుర్భేద్యమైన కోటను నిర్మించాడు. ఓరుగల్లునందు మనుమసిద్ధి ఆస్థానకవియైన తిక్కన సోమయాజి, నన్నయ్య అసంపూర్ణముగా మిగిల్చిన మహాభారతాన్ని మిగిలిన 15 పర్వములు పూర్తి గావించి -



కవిబ్రహ్మ, ఉభయకవిమిత్రునిగా వినతికెక్కాడు. గణపతి దేవుని కుమార్తె అయిన రాణీ రుద్రమదేవి తెలుగువారికి గర్వకారణం. ఆమె మనుమడు ప్రతాపరుద్రుడు. వీరి కాలంలో వెలసిన వేయి స్థంబాల గుడి, రామప్ప దేవాలయము నేటికీ వారి ప్రాభవాన్ని చాటుతున్నాయి.

తరువాత నలగామరాజు, మలిదేవరాజుల మధ్య సమరము పల్నాటి యుద్ధముగా పరిణమించింది. నాయకురాలు నాగమ్మ నలగామరాజు పక్షాన, బ్రహ్మనాయుడు మలిదేవుని పక్షాన పోరాడిన వీరగాథ విన్నప్పుడు, బ్రహ్మనాయుని కుమారుడు బాలచంద్రుడు, అతని భార్య మాంచాల చూపిన పౌరుషం మనల్ని కదిలిస్తుంది. పౌరుషం గురించి చెప్పేటప్పుడు బొబ్బిలి గుర్తురాక మానదు. "పులి పులి పులి పులి - బొబ్బిలి బెబ్బులి - కణకణమండే నిప్పుల పిడికిలి - పట పట పట పట పండ్లు కొరికెరా - చట చట చట చట ముందుకురికెరా - ఎవరీ వీరుడు ఓరన్నా?" అంటే "తాండ్ర పాపన్న" అని తాండ్ర పాపారాయుని గురించి బుర్రకథ రూపంలో తెలియజెప్పడం మనకు తెలిసినదే. విజయనగర సంస్థానాధీశుడు విజయరామరాజు బుస్సీ దొరతో కలసి కుతంత్రంతో బొబ్బిలి సంస్థానాన్ని తుదముట్టించినపుడు, రంగారాయుని అద్వర్యంలో బొబ్బిలి చూపిన పౌరుషం అనన్య సామాన్యం.

పిదప రెడ్డి రాజుల కాలంలో సంగీత, సాహిత్య, నృత్య కళలు బాగా ఆదరింపబడ్డాయి. కాటయ వేమారెడ్డి, ప్రోలయ వేమారెడ్డి వీరిలో ముఖ్యులు. శ్రీ మదాంధ్ర మహాభారతములోని అరణ్య పర్వంలో నన్నయ్య వ్రాయగా మిగిలిన శేషభాగాన్ని పూరించిన ఎర్రాప్రగడ, ప్రోలయ వేమారెడ్డి ఆస్థానకవి. నన్నయ్య, తిక్కన, ఎర్రాప్రగడలను కలిపి కవిత్రయము అంటారు. ఇక శృంగారనైషధం, కాశీఖండం, భీమఖండం, హరవిలాసం, పల్నాటి చరిత్ర రచించిన కవిసార్వభౌముడు శ్రీనాధుడు అనపోతారెడ్డి కాలంలోనివాడు. మహాభాగవతమును రసవత్తరంగా రచించి, దానిని మానవమాత్రులకు అంకితమీయనని ప్రతిన చేసి, శ్రీ రామచంద్రునికే అంకితమిచ్చిన మహాకవి బమ్మెరపోతన శ్రీనాధుని

సమకాలికుడని పలువురి విశ్వాసము. ప్రహ్లాద చరితము, గజేంద్రమోక్షములలో పద్యములు మనలో చాలామందికి కంఠోపాఠమేకదా! "పలికెడిది భాగవతమట, పలికించెడివాడు రామభద్రుండట" అంటూ "మందార మకరంద మాధుర్యమున" ఓలలాడిస్తూ, భాగవత సన్నివేశాల్ని కళ్ళకు కట్టినట్లు తెనిగించిన పోతనను, శ్రీనాధుని బావ-మరుదులుగా చిత్రిస్తూ ఓ కథ వాడుకలో ఉంది.

ఒకసారి పోతనగారు భాగవతరచన చేస్తున్న సమయంలో శ్రీనాధులవారు పోతనను సందర్శించడానికి వచ్చారట. ఆ సమయంలో గజేంద్రమోక్షమునకు సంబంధించిన ఘట్టం సాగుతోందట. శ్రీనాధుని కోరిక మేరకు పోతనగారు "లావొక్కింతయు లేదు; ధైర్యము విలోలంబయ్యె ప్రాణంబులుం ఠావుల్ దప్పెను; ... సంరక్షించు భద్రాత్మకా!" అని చెప్పి, అప్పుడు శ్రీహరి భక్తుని రక్షించుటకై "సిరికిం జెప్పడు; శంఖచక్రయుగముం జేదోయి సంధింప; ... గజప్రాణావనోత్సాహియై" అంటూ ముగించేసరికి శ్రీనాధుడు "ఆయుధము లేకుండా యుద్ధానికి వెళ్ళడమేమిటి?" అని హేళన చేసాడట. అనంతరము కొన్ని నాళ్ళకు శ్రీనాధుని సందర్శించు సమయాన, ఓసారి పోతనగారు శ్రీనాధుని కుమారుని వెంటబెట్టుకుని స్నానమునకు పోయిరట. కొద్దిసేపటికి పోతనగారు శ్రీనాధుని వద్దకు పరుగున వచ్చి, ఆయన కుమారుడు బావిలో పడెనని చెప్పెనట. శ్రీనాధుడు ఆ మాట విన్నవెంటనే అనాలోచితంగా బావివద్దకేగి "ఏడి నా పుత్రుండేడి?" అని ఆతృతతో ప్రశ్నించగా, అప్పుడు పోతనగారు "బావిలో పడ్డ కుమారుని రక్షించడానికి నీవేల వట్టి చేతులతో వచ్చితివని?" ప్రశ్నించెనట. పోతన అంతర్యము గ్రహించిన శ్రీనాధులవారు తన తప్పు తెలుసుకుని, పోతన గజేంద్రమోక్షములోని ఘట్టము సందర్భోచితంగా ఉందని కొనియాడారని చెబుతారు. పోతన "కలము చేతబట్టి కావ్యంబు రచించె; హలము చేతబట్టి పొలము దున్నె; కలము-హలములందు ఘనుడురా పోతన్న" అని వేమనచే కీర్తింపబడ్డాడు.

రెడ్డిరాజుల కాలంలో భోగభాగ్యాలతో తులతూగిన శ్రీనాధుడు, రెడ్డిరాజుల అనంతరము కవి పోషకులకు కరువై చాలా కష్టములననుభవించెనని చెబుతారు. ఈయన చాటువులు బహు ప్రసిద్ధములు. "చిన్న చిన్న రాళ్ళు - చిల్లర దేవుళ్ళు, నాగులేటి నీళ్ళు - నాపరాళ్ళు, సజ్జ జొన్న కూళ్ళు - సర్పంబులును తేళ్ళు, పల్లనాటి సీమ పల్లెటూళ్ళు" అని కరువు కాటకాల బారిన పడి బీటలు వారిన భూములను వర్ణించిన సందర్భములోనిది ఈ చాటువు. అలాగే తాగేందుకు చుక్క నీళ్ళు దొరకని ఓ సందర్భములో "సిరిగలవానికి చెల్లును తరుణుల పదియారువేల తగ పెండ్లాడన్ ; మురిపెమునకిద్దరాండ్రా పరమేశా! గంగ విడుము పార్వతి చాలున్" అనే చాటువు చెప్పాడట.

(తరువాయి భాగము వచ్చే సంచికలో)